క్లుప్తంగా

నేడు శ్రీవేంకటేశ్వర కల్యాణం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో శనివారం శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన కొత్తగూడెంలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం మాట్లాడారు. ప్రకాశం స్టేడియంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి సమక్షాన స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో డాక్టర్ నాగరాజు, ఎంవీ చౌదరి, సాబు, ఝల్దండి పూర్ణ చందర్‌రావు, కంచర్ల సతీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా రామకృష్ణ

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జూలూరుపాడు మండల అధ్యక్షుడిగా భేతాళపాడుకు చెందిన గోపు రామకృష్ణ నియమితులయ్యారు. శుక్రవారం ఆయనకు సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నియామక పత్రం అందజేశారు. పొన్నెకంటి సతీష్ కుమార్, లకావత్ లచ్చు నాయక్, రోకటి సురేష్, రామిశెట్టి రాంబాబు, నరసింహారావు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన దంత వైద్యురాలు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో శుక్రవారం దంత వైద్యురాలుగా డాక్టర్ ప్రదీప్తి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గురువారం సాక్షి దినపత్రికలో 'దంత వైద్య సేవలు అందేనా?' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష్ తిరిగి విధుల్లో చేరాలని డాక్టర్ ప్రదీప్తిని ఆదేశించారు. దీంతో గత డిసెంబర్‌లో నిలిచిపోయిన దంత వైద్యసేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి.

సాక్షి ఎఫెక్ట్..

జీసీసీ గోదాముల పరిశీలన

పాల్వంచరూరల్: స్థానిక గిరిజన సహకార సంస్థ (జీసీసీ) బ్రాంచ్‌ను గురువారం ఐటీడీఏ ప్రత్యేకాధికారి ఉదయ్‌భాస్కర్ సందర్శించారు. ఐడీడీఏకు చెందిన గోదాములలోని నిత్యావసర సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట జీసీసీ మేనేజర్ లక్ష్మాజీ ఉన్నారు.

ఓటింగ్ ద్వారా కమిటీలను ఎన్నుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని అన్ని ఏరియాల కమిటీలను ఓటింగ్ ద్వారా ఎన్నుకోవాలని ఐఎన్‌టీయూసీ నాయకుడు ముప్పాని సోమిరెడ్డి కోరారు. కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 12ఏళ్ల తర్వాత సింగరేణిలో ఐఎన్‌టీయూసీ గెలుపొందగా... కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాలతో కార్మికులు గందరగోళానికి గురవుతున్నట్లు చెప్పారు. ఐఎన్‌టీయూసీ కార్మికుల హక్కుల కోసం పాటుపడుతుందని నాయకులు, కార్యకర్తలు పదవుల కోసం గ్రూప్‌లుగా విడిపోవడం సరికాదని పేర్కొన్నారు. ఇష్టారాజ్యంగా ఏరియా కమిటీలు నియమించకుండా ఓటింగ్ ద్వారా చేపట్టాలని కోరారు.

ఎలక్ట్రిసిటీ యూనియన్ కమిటీ ఎన్నిక

పాల్వంచరూరల్: తెలంగాణ ఎలక్ట్రిసిటీ వెనకబడిన తరగతుల ఎంప్లాయీస్ అసోసియేషన్ కేటీపీఎస్ ఐదు, ఆరు బ్రాంచ్‌లకు గురువారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా బి.నరేందర్, కార్యదర్శి కె.సతీష్, లైజన్ ఆఫీసర్ తోట వెంకటేశ్వర్లు, కోశాధికారి వినోద్ కుమార్ సాహు, వర్కింగ్ ప్రసిడెంట్ డి.దేవేందర్, డి.శ్రీనివాస్, వైస్ ప్రసిడెంట్ టి.సత్యం, బి.సదానందం, జాయింట్ సెక్రటరీ కె.పుల్లారావు, ఎ.శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శి ఎం.వీరభద్రం, బి.రమేష్‌లను ఎన్నుకున్నట్లు జెన్‌కో అధ్యక్షుడు రవీందర్ తెలిపారు.

సింగరేణి సీఎండీకి ఫిర్యాదు

కొత్తగూడెంరూరల్: సింగరేణి సంస్థలో 2015 నుంచి జరిగిన అవకతవకలపై రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరీ సింగరేణి సీఎండీ బలరాంకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవనంలో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను కలిసి, 2015 నుంచి సింగరేణి సంస్థలో జరిగిన రాత పరీక్షలు, బదిలీలు, కారుణ్య నియమకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం

పాల్వంచరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావును శుక్రవారం పాతపాల్వంచలోని ఆయన నివాసంలో పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పులమాలలతో సత్కరించారు. సొసైటీ డైరెక్టర్లు భూక్యా కిషన్, చేవగాని పాపారావు, భూక్యా శంకర్, ఉండ్రాతి రవి, నాగారం ఉపసర్పంచ్ చందు, పెద్దమ్మగుడి డైరెక్టర్ చిన్న వెంకట్రామయ్య, లింగం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిపో కొత్తదే.. బస్సులు పాతవి!

- ఇల్లెందు డిపో ప్రారంభమై ఐదు నెలలు గడిచినా అవే బస్సులు
- కనీస సదుపాయాలు లేక ప్రయాణికుల విలవిల
- రాత్రివేళల్లో సమాచారం ఇచ్చే నాథుడే కరువు
- మేడారం జాతరకు సైతం ఖమ్మం నుంచే బస్సుల కేటాయింపు


డిపోకు కేటాయించిన పాత బస్సులు

ఇల్లెందు: ఇల్లెందు వాసుల ఏళ్ల నాటి కల తీరేలా ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటైందని సంతోషపడుతుండగా... ఒక్కటంటే ఒక్కటి కూడా కొత్త బస్సు లేక పాత బస్సులే కేటాయించి డిపోలో కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో ప్రజలు మళ్లీ ఉసూరుమనాల్సి వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో కొత్త బస్సులు కొనుగోలు చేసినా ఇల్లెందు డిపోకు మాత్రం ఇతర డిపోల్లో వాడిన పాత బస్సులనే కేటాయించారు. గత ఏడాది ఆగస్టు 28న అప్పటి మంత్రి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, హరిప్రియ 2.75 ఎకరాల స్థలంలో రూ.3.75 కోట్ల నిధులతో నిర్మించిన శాటిలైట్ డిపోను ప్రారంభించారు. అంటే డిపో ప్రారంభమై ఐదు నెలలు దాటుతుండగా... ఇల్లెందు, గుండాల, టేకులపల్లి, ఆళ్లపల్లి, కారేపల్లి మండలాలకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పినా అలాంటిదేమీ కానరావడం లేదు.

అన్నీ వాడిన బస్సులే..

ఇల్లెందు డిపో ప్రారంభించిన సమయాన కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం డిపోల నుంచి 24 బస్సులు కేటాయిస్తామని చెప్పి 23 బస్సులు కేటాయించారు. ఖమ్మం నుంచి సూపర్ లగ్జరీ రెండు సర్వీసులు, ఎక్స్‌ప్రెస్ ఒకటి, జేఎన్‌ఎస్‌యూఆర్‌ఎం నాలుగు, మినీ పల్లె వెలుగు మూడు సర్వీసులు, కొత్తగూడెం నుంచి జేఎన్‌ఎస్‌యూఆర్‌ఎం మూడు సర్వీసులు, పల్లె వెలుగు రెండు, మినీ పల్లె వెలుగు నాలుగు, మహబూబాబాద్ నుంచి పల్లె వెలుగు మూడు, మినీ పల్లె వెలుగు తదితర బస్సులు ఇందులో ఉన్నాయి. ఇవన్నీ కూడా ఆయా డిపోల పరిధిలో వేలాది కిలోమీటర్లు తిరిగి బస్సులే కావడం గమనార్హం.

ఆతర్వాత అయినా...

ఐదు నెలల కాలంలో ఇల్లెందు డిపోలో సౌకర్యాల కల్పన, బస్సుల కేటాయింపును పట్టించుకున్న వారే కరువయ్యారు. ఆనాటి నుంచి ఈ నాటి వరకు పాత బస్సులే నడుస్తున్నాయి. ఇక 23 బస్సులు కేటాయించినట్లు చెప్పినా 18 బస్సులే నడుస్తున్నాయి. అలాగే, సుమారు 169 మంది సిబ్బందిని కేటాయిస్తామన్న అధికారులు 106 మందిని ఇచ్చారు. బస్సుల మరమ్మతుకు సరిపడా నిపుణులైన సిబ్బంది కూడా ఇందులో లేరు. దీంతో బస్సుల మరమ్మతు అవసరమైతే మళ్లీ కొత్తగూడెం తీసుకెళ్తున్నారు.

రాత్రి వేళల్లో అంతంతే..

ఇల్లెందు బస్టాండ్‌లో రాత్రివేళ సమాచారం ఇచ్చేందుకు ఎవరూ ఉండటం లేదు. కనీసం ఫోన్ చేసినా ఎవరూ స్పందించడం లేదు. డిపో ప్రారంభోత్సవం జరిగిన వెంటనే అధికారులు ప్రకటించినట్లుగా ఉద్యోగుల కేటాయింపులు ఉంటాయని, నూతన రూట్లకు సర్వే చేసి బస్సులు నడిపిస్తారని ఆశించినా అది జరగలేదు. అంతేకాక తాగునీటి వసతి, మరుగుదొడ్లు కూడా నిర్మించకపోవడంతో మహిళా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జాతరకూ ఖమ్మం నుంచే...

మేడారంలో జరగనున్న సమ్మక్క – సారలమ్మ జాతరకు ఇల్లెందు నుంచి బస్సులు నడిపేందుకు ఆర్టీసీ నిర్ణయించింది. అయితే ఈ బస్సులేవీ ఇల్లెందు డిపోవి కావు. ఖమ్మం ఆర్‌ఎం పర్యవేక్షణలో ఖమ్మం డిపో నుంచే నడపనున్నారు. కేవలం ఇల్లెందులో పాయింట్ మాత్రమే ఉంటుంది. ఇల్లెందు డిపోలోని బస్సులను ప్రస్తుతం నడిచిన రూట్లలోనే నడిపించనున్నట్లు అధికారులు ప్రకటించడంతో మేడారం జాతరతో డిపోకు ఎలాంటి సంబంధం లేకుండా పోయినట్లయింది.


ఇల్లెందు బస్ డిపో

కొత్త బస్సులు కేటాయించలేదు..



ప్రస్తుతం 23 బస్సులు, 106 మంది సిబ్బందితో డిపో కొనసాగుతోంది. బస్సులకు మేజర్ రిపేర్ వస్తే కొత్తగూడెం తరలిస్తున్నాం. ఇప్పటి వరకై తే కొత్త బస్సులను కేటాయించలేదు. ఇక మేడారానికి ఖమ్మం డిపో నుంచి బస్సులు నడవనున్నాయి. ఇక్కడి బస్సులు ప్రస్తుత రూట్లలో కొనసాగుతాయి.

– డి.సంజీవరాణి, అసిస్టెంట్ మేనేజర్

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచండి


మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: పర్మనెంట్ కార్మికులతో సమానంగా పని చేసి ఉత్పత్తిలో కీలక భూమిక పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఇఫ్టూ ప్రతినిధి బృందంతో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని ఇతర చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని, లోడింగ్ అన్‌లోడింగ్ కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని కోరారు. ఒక పర్మనెంట్ కార్మికుడికి వస్తున్న వేతనంతో పది మంది కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. సింగరేణికి రూ.కోట్ల లాభాలు వస్తున్నాయని కాంట్రాక్ట్ కార్మికులకు మాత్రం ఆశించినంత వేతనం పెంచటం లేదన్నారు. చట్టబద్ధ హక్కులు కల్పించాలని, జాతీయ పండుగలకు మస్టర్‌తో కూడిన సెలవు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకుబ్ షావలీ, నాయకులు రాజబాబు, రాంబాబు, మేకల శ్రీను, సైదులు, బాలు, నరేష్, ప్రణయ్, లింగమూర్తి పాల్గొన్నారు.

ఎంపీ టికెట్‌కు 'పోట్ల' దరఖాస్తు


దరఖాస్తు అందజేస్తున్న పోట్ల నాగేశ్వరరావు

కొత్తగూడెంరూరల్: ఖమ్మం పార్లమెంట్ స్థానం కోసం టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం తెలంగాణ పార్లమెంట్ ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షీని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరి, సీనియర్ సములు నాయక్, అడ్వకేట్ సుమన్ తదితరులు ఉన్నారు.

మహబూబాబాద్‌కు..

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు శుక్రవారం పీసీసీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డిని కలిసి మహబూబాబాద్ ఎంపీ టికెట్ కేటాయించాలని దరఖాస్తు చేశారు.

కీచక ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): ఇల్లెందు ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్న ఉపాధ్యాయుడిని వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడి వేధింపులు తట్టుకోలేక గతనెల 21న విద్యార్థినులు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. స్పందించి కమిటీల పేరిట కాలయాపన చేయకుండి ఉపాధ్యాడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

సుజాతనగర్: ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, మోసపూరితమైన ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని సైబర్ క్రైమ్ డీఎస్పీ కృష్ణయ్య తెలిపారు. అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ నేరాలపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. మొబైల్స్‌లో ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్, ఓఎల్‌ఎక్స్, అమేజాన్, ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ లోన్ యాప్స్ వంటి వాటితో సైబర్ నేరస్తులు మోసం చేస్తున్నారని తెలిపారు. ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేయాలని, లాటరీ వచ్చిందని ఏటీఎం కార్డ్ నంబర్ చెప్పాలని, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ వచ్చే కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. రాష్ట్రంలో ఇటీవల సైబర్ క్రైమ్ నేరస్తుల సంఖ్య పెరిగిందని, వారు చూపించే ఆఫర్ల పట్ల ప్రజలు ఆకర్షితులై మోసపోవద్దని తెలిపారు. ఎవరైనా ఆన్‌లైన్‌లో మోసపోయినట్లయితే వెంటనే 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సీఐ జితేందర్, సుజాతనగర్ ఎస్‌ఐ ముత్తినేని సోమేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ వి.సీతారామ్ ప్రసాద్, ఏఎస్‌ఐ రామకృష్ణ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ కృష్ణయ్య

రహదారి నిర్మాణం చేపట్టాలి

టేకులపల్లి: పెట్రాంచెలక స్టేజీ నుంచి కారేపల్లి తండా వరకు 2018–19లో నక్సల్స్ ప్రభావిత ప్రాంత నిధులు రూ.14 కోట్లు మంజూరయ్యాయి. పరిపాలన, సాంకేతిక, శాఖాపరమైన కారణాల రీత్యా నేటికీ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. తాజాగా పాత రోడ్డుని తవ్వి, మిక్సింగ్ వేసి వదిలేశారు. తారు వేస్తే రోడ్డు నిర్మాణం పూర్తయినట్లే. కానీ నేటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో దుమ్ము ధూళితో వాహనదారులు, పాదచారులు, వివిధ రకాల పంటలు వేసి నష్టపోయిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం పెట్రాంచెలక పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ నగేష్ ఆధ్వర్యంలో రోడ్డుపై లారీలను నిలిపి నిరసన వ్యక్తం చేశారు. దీంతో స్టేజీ నుంచి బోడు వైపుకి, బోడు నుంచి టేకులపల్లి వైపుకు వచ్చే వాహనాలు నిలిచి ట్రాఫిక్ జామ్ అయింది. బోడు ఎస్‌ఐ రంజిత్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరిగతిన రోడ్డు నిర్మాణం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

ఉపాధి హామీ పథకం ఆవిర్భావ వేడుకలు


పాల్వంచరూరల్: కేక్ కట్ చేస్తున్న కూలీలు


టేకులపల్లి: బేతంపూడిలో ఉపాధి హామీ కూలీలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభమై 18 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఉపాధి కూలీలు సంబురాలు జరుపుకున్నారు. మండలంలోని కేశవాపురం గ్రామంలో కూలీల సమక్షంలో అధికారులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.అప్పారావు, ఏపీఓ పారండ్ల రంగా, ఈసీ పుల్లయ్య, కార్యదర్శి కృష్ణవేణి, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవం వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం బేతంపూడి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ కూలీలకు స్వీట్లు పంపిణీ చేశారు. బోడు పంచాయతీలోనూ కార్యదర్శి రేళ్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరబాబు, ఎంపీఓ గణేష్, ఏపీఓ కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, ఎఫ్‌ఏ భద్రం, టెక్నికల్ అసిస్టెంట్ ఈశ్వరి, ఎఫ్‌ఏ పూర్ణ పాల్గొన్నారు.

యోగా విద్యార్థులకు అభినందనలు

సింగరేణి(కొత్తగూడెం): ఇండియన్ యోగా స్కూల్ వారి ఆధ్వర్యంలో ఈనెల 4న బెల్లంపల్లిలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయిన విద్యార్థులను శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయ చాంబర్‌లో జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య అభినందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ పొందిన శ్రీచైతన్య భారత్ స్కూల్ (రామవరం) విద్యార్థులు జాతీయ స్థాయిలో యోగా చాంపియన్ షిప్‌కు ఎంపికవడం అభినందనీయమన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన యోగా గురువు గుమలాపురం సత్యనారాయణను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం సుశీల్‌కుమార్, ప్రభాకర్, పీఈటీ లక్ష్మి, ఎం.కవిత, ఇందు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న జీఎం బసవయ్య

పేదల సంక్షేమాన్ని పట్టించుకోని కేంద్రం


కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


టేకులపల్లి: మాట్లాడుతున్న హరీష్

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సామాన్య, పేదల ప్రజల సంక్షేమం పట్టించుకోకపోవటం దుర్మార్గమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరకు కనకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేదలందరినీ లక్షాధికారుల్ని చేస్తానని మాయమాటలు చెప్పి గద్దెనెక్కిందన్నారు. కానీ పేద ప్రజల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. పేదలకు ప్రజాపంపిణీ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వ నిధులు రూ.31 కోట్లు తగ్గించటం సిగ్గుచేటన్నారు. దేశంలో ఆహార భద్రత చట్టం చేయాలని, ఆహారధాన్యాలు, సన్న బియ్యం, పప్పుధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువులు, కేరళ ప్రభుత్వం వలె పేదలకు అందించి ఆకలి చావులు నివారించాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

పాల్వంచరూరల్: కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపిందని ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బడ్జెట్‌లో ఎలాంటి కొత్త సంక్షేమ పథకం గురించి ప్రస్తావించలేదన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలను నడ్డి విరిచేలా బడ్జెట్ ఉందన్నారు. వ్యవసాయానికి, రైతులకి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ విద్యారంగానికి తీరని లోటని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు హరీష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యారంగానికి పది శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.61 శాతం కేటాయించడమేమిటని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ఈ నిధులు ఏమాత్రం సరిపోవన్నారు. దేశంలో విదేశీ ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇస్తూ ప్రభుత్వ విద్యను ధ్వంసం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో వెంకటేష్, ప్రవీణ్ సంతోష్ కుమార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ యువజన వ్యతిరేక బడ్జెట్ అని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలమైందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, వైద్య రంగాలను విస్మరించడం శోచనీయమన్నారు.

కోర్టులో పుస్తకావిష్కరణ


ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

ఇల్లెందు: నూతనంగా ప్రవేశపెట్టిన క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి డి.కీర్తి చంద్రికారెడ్డి తెలిపారు. శుక్రవారం కోర్టు హాల్‌లో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు దూస జనార్థన్ ముద్రించిన కాంపెండియం బుక్‌ను కోర్టు హాల్‌లో అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సత్యప్రకాష్, ఏజీపీ మల్లికార్జునరావు, సీనియర్ న్యాయవాదులు మల్లికార్జున్‌రావు, ఎస్.చెన్నకేశవరావు, నరసయ్య, దంతాల ఆనంద్, నెద్దూరి నర్సయ్య, సూర్నపాక సత్యనారాయణ, రవికుమార్, కీర్తి కార్తీక్, ఉమామహేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

6న ఆత్మీయ సమ్మేళనం

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 6న జరగనున్న ఆల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సభకు జిల్లా నుంచి తరలివచ్చి విజయవంతం చేయాలని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య కోరారు. కొత్తగూడెంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను చర్చించి ప్రభుత్వం తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ మేరకు ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటంలో కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో సగుర్తి దిలీప్, ఎస్.కృష్ణ, జి.కృష్ణ, బి.బాలాజీ, ఎం.వినోద్, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మయ్య

అంకితభావంతో పల్లెలను అభివృద్ధి చేశాం..

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు ఐదేళ్ల పదవీ కాలం ముగిసింది. ఈ మేరకు శుక్రవారం సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. వెంగన్నపాలెం, సాయిరాంతండా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తుల ఆధ్వర్యంలో సన్మానించారు.

ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేవీ వెంకటేశ్వరరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, సెర్ప్ ఏపీఎం సత్యనారాయణరాజు, వెంగన్నపాలెం, సాయిరాం తండా సర్పంచ్‌లు గలిగె సావిత్రి, ధరావత్ రోజా–బాలోజీ దంపతులు, ఉపసర్పంచ్ దేవరకొండ కిరణ్, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: అధికారులను, ప్రజలను సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో పల్లెలను అభివృద్ధి చేశామని సర్పంచ్‌లు అన్నారు. పదవీకాలం ముగియడంతో మండల పరిషత్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ.. ఐదేళ్లపాటు ఒక కుటుంబంగా మెలిగిన సర్పంచ్‌లు ఒకరికొకరు సహకరించుకుంటూ సమస్యలను ధైర్యంగా ఎదుర్కొన్నామని గుర్తుచేశారు. ఐదేళ్ల పాటు నిరంతరం శ్రమించడం వల్లే పల్లెల్లో మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాంకుడోత్ ఉమాదేవి, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి, ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కుంజ కృష్ణ తదతరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: గ్రామ పంచాయతీ పాలకవర్గాల కాల పరిమితి ముగిసింది. ఈ మేరకు శుక్రవారం మండలంలోని మాజీ సర్పంచ్‌లు కోయగూడెంలో పూనెం ఉమ, మద్రాస్‌తండాలో మాలోతు రాజేందర్ నాయక్, తొమ్మిదోమైలు తండాలో జర్పుల బిచ్చాలతో పాటు పాలకవర్గం సభ్యులకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఊకే వసంతరావు, భూక్యా రమేష్, సురేష్, ప్రసాద్, రామారావు, సందీప్, నాగు, పకీర, మోహన్, శ్రీను, శ్రీకాంత్, దస్రు, నరేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: సర్పంచ్‌లతో అధికారులు


టేకులపల్లి: కోయగూడెంలో పూనెం ఉమ, సురేందర్ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు


జూలూరుపాడు: వెంగన్నపాలెం సర్పంచ్ గలిగె సావిత్రిని సన్మానిస్తున్న స్థానికులు